కొత్త పింఛన్లు ఎప్పుడిస్తారో?

- డబ్బులు ఇవ్వడం మరిచారు...
- గత నెల 12న స్పౌజ్ పింఛన్లు మంజూరు చేస్తామని కూటమి సర్కార్ ప్రకటన
- మండలంలో 145 మంది ఎదురు చూపులు


వృద్ధురాలికి ఫించను అందజేస్తున్న సచివాలయం ఉద్యోగి(ఫైల్)

గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామానికి చెందిన సారిక పోలయ్య ఏప్రిల్ నెలలో చనిపోయారు. ఇతనికి వృద్ధాప్య పింఛన్ వచ్చేది. అతని భార్య సారిక కళావతికి మే నెలలో పింఛన్ రావాల్సి ఉంది. కానీ రాలేదు. జూన్ నెల 12వ తేదీన ఈమెకు భాగస్వామి పింఛన్ మంజూరు అయిందని సచివాలయ సిబ్బంది ఆమెకు సమాచారం అందించారు. కానీ నేటి వరకు ఆమెకు పింఛన్ కింద ఇవ్వాల్సిన రూ.4 వేలు ఇవ్వలేదు. అదేమిటని సచివాలయం ఉద్యోగులను ఆమె అడిగితే పింఛన్ మంజూరు అయిందని కానీ డబ్బులు రాలేదని చెప్పారు. దీంతో చేసేది లేక మిన్నకుండిపోయారు.

కూటమి సర్కార్ అధికారం చేపట్టి ఏడాది పూర్తయి రెండో ఏడాదిలోకి అడుగు పెట్టింది. ఈ ఏడాది కాలంలో కొత్తగా ఏ ఒక్కరికి వితంతువులకుగాని, దివ్యాంగులకుగాని, వృద్ధులకుగాని, డప్పు కళాకారులకుగాని, కల్లుగీత కార్మికులకుగాని, చేనేత కార్మికులకుగాని, ట్రాన్స్‌జెండర్స్‌కుగాని ఫించను మంజూరు చేసిన దాఖలాలు లేవు.

వృద్ధాప్య పింఛన్ వచ్చి భర్త చనిపోతే భార్యకు ఇచ్చే స్పౌజ్ (భాగస్వామి) ఫించన్లు మాత్రమే ఇస్తుంది. దాన్ని కూడా కొత్తగా ఫించన్లు మంజూరు చేసినట్టు గొప్పగా చెప్పుకుంటుంది. పోనీ అవి కూడా సకాలంలో ఇస్తున్నారా.. అంటే అది లేదు. ప్రచారంలో ఉన్న శ్రద్ధ అమలులో చూపించడంలో లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

స్పౌజ్ కోటా కింద 145 పింఛన్లు మంజూరు

మండలంలోని స్పౌజ్ (భాగస్వామి) కోటా క్రింద పింఛన్లు 145 మంజూరు అయ్యాయి. వీరందరికి గత నెలలో 12వ తేదిన పింఛన్లు అందజేస్తామని కూటమి సర్కార్ చెప్పింది. అయితే 12వ తేదీ అయిపోయింది. జూలై ఒకటో తేదీ నాటికి అయినా ఇచ్చింది అంటే అదీ లేదు. ఒకటో తేదీనాడు కూడా వారికి పింఛన్ డబ్బులు ఇచ్చింది లేదు.

మంజూరయ్యాయి..

మండలంలో 145 మందికి స్పౌజ్ కోటా కింద పింఛన్లు మంజూరు అయ్యాయి. వీటికి సంబంధించి డబ్బులు విడుదలయ్యాయి. అయితే వేల్ఫేర్ అసిస్టెంట్ యాప్‌లో ఎనబుల్ అవ్వలేదు. దీని వల్ల డబ్బులు ఇవ్వలేదు. యాప్‌లో ఎనబుల్ 3, 4 తేదీల్లో అవుతుందని అంటున్నారు. అవ్వగానే డబ్బులు అందజేయడం జరుగుతుంది.

– ఆర్.వి.రమణమూర్తి, ఎంపీడీవో, గంట్యాడ

అల్లుకున్న నిర్లక్ష్యం..!



ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఏదో పూల మొక్క అనుకుంటే పొరపాటే. అది విద్యుత్ స్తంభం. అది కూడా 11 కేవీ సామర్థ్యంతో విద్యుత్ ప్రవహించే విద్యుత్ స్తంభం. ఈ విద్యుత్ స్తంభం ఎక్కడో మారుమూల గ్రామీణ ప్రాంతంలో లేదు సాక్షాత్తూ పట్టణంలోని ఆంజనేయపురంలోని శివరాం రోడ్‌లో ఉంది. స్తంభానికి పై వరకు మొక్కలు అల్లుకుని అసలు ఇది విద్యుత్ స్తంభమేనా అనేలా తయారయ్యింది. అయితే ఇక్కడ ఏపీఈపీడీసీఎల్ అధికారులు పరిపాలనలో ఉన్నప్పటికీ ఇలాంటి విద్యుత్ స్తంభాలపై ఉన్న పిచ్చి మొక్కలు తొలగించేందుకు కనీసం చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. – చీపురుపల్లి

డెంగీ, మలేరియాపై అవగాహన ర్యాలీ



దోమకాటు వల్ల డెంగీ, మలేరియా వ్యాధులు వ్యాప్తి చెందుతాయని తెలుపుతూ గంట్యాడ మండలం పెదమజ్జిపాలేం పీహెచ్‌సీ సిబ్బంది మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగీ మాసోత్సవాల్లో బోనంగి గ్రామంలో ర్యాలీని ఈవో రాజ్ ప్రారంభించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా దోమల వృద్ధి తగ్గుతుందన్నారు. ఆరోగ్య సహాయకులు ఈశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ తిరుపతి, ఎంఎల్‌హెచ్‌పీ హరీష్ తదితరులు పాల్గొన్నారు. – గంట్యాడ

క్లుప్తంగా

శిథిల గ్రంథాలయం పరిశీలన


శిథిల గ్రంథాలయ భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట: పట్టణంలో ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న శిథిల గ్రంథాలయ భవనాన్ని ఎమ్మెల్సీ రఘురాజు పరిశీలించారు. గ్రంథాలయ శాశ్వత భవనం నిర్మాణానికి తన ప్రయత్నం చేస్తానని, ప్రభుత్వం దృష్టికి సమస్య తీసుకువెళ్తామని ఆయన లైబ్రేరియన్ శ్రీధర్, పాఠకులకు హామీ ఇచ్చారు.

హైస్కూల్‌ను సందర్శించిన డీఈవో


విద్యా ప్రమాణాలు తెలుసుకుంటున్న డీఈవో

జామి: మండలంలోని కుమరాం జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం డీఈవో యు.మాణిక్యంనాయుడు సందర్శించారు. పాఠశాల విద్యార్థుల యొక్క విద్యా ప్రగతి, విద్యా ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు పరిశీలించారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు, పాఠశాల ఉపాధ్యాయులతో పాఠశాలలో మౌలిక సదుపాయాలు తదితర అంశాలు చర్చించారు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ విద్యార్థుల విద్యాప్రగతి మరింత మెరుగు పరచడానికి ఉపాధ్యాయులకు సూచనలు అందించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు సత్కారం


విశ్రాంత ఉద్యోగులను సత్కరిస్తున్న డీఎం రమేష్ తదితరులు

శృంగవరపుకోట: ఆర్టీసీలో కొన్నేళ్లుగా సేవలందించి ఉద్యోగ విరమణ చేస్తున్న ఉద్యోగులను మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపోలో డి.ఎం కె.రమేష్, సహోద్యోగులు ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. కండక్టర్లు బి.వి.రమణ, ఎస్.తవిటయ్య, మెకానిక్ నూక రాజులకు దుశ్శాలువలు కప్పి, పూలమాలలు వేసి, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. డి.ఎం కె.రమేష్ మాట్లాడుతూ సర్వీసు కాలంలో నమ్మకమైన వారి సేవలకు ధన్యవాదాలు తెలిపారు. సహోద్యోగులు మాట్లాడుతూ ఉద్యోగానంతర జీవితం ఆరోగ్యం, ప్రశాంతతతో సాగాలని ఆకాంక్షించారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని తెలియజేయండి


మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం: టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు తెలియపరచాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, క్లస్టర్ బూత్ ఇంచార్జ్‌లతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సుపరిపాలనలో భాగంగా తొలి అడుగు సమావేశ కార్యక్రమానికి హాజరయిన టీడీపీ కుటుంబసభ్యులందరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పివివి.గోపాల రాజు, వైస్ చైర్మన్ కోరాడ కృష్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అంగన్‌వాడీ వింగ్ సంయుక్త కార్యదర్శిగా వాణి


వాణి

గంట్యాడ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అంగన్‌వాడీ వింగ్ సంయుక్త కార్యదర్శిగా బుడతానపల్లి గ్రామానికి చెందిన అలమండ వాణి నియమితులయ్యారు. ఈమె ప్రస్తుతం గ్రామ సర్పంచ్‌గా కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామన్నారు.

అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్టే... : ఎంపీ శ్రీభరత్

కొత్తవలస: మనం అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్లే వ్యవహరించాలని పార్టీ శ్రేణులకు విశాఖ ఎంపీ శ్రీభరత్ పిలుపునిచ్చారు. తుమ్మికాపల్లి గ్రామం సమీపంలో గల ఒక ప్రైవేట్ కల్యాణ మండపంలో కొత్తవలస మార్కెటింగ్ కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్యఅతిథిగా మంగళవారం హాజరయ్యారు. ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కొత్తవలస మార్కెటింగ్ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులుగా చొక్కాకుల మల్లునాయుడు, తూర్పాటి అదిబాబులతో పాటూ కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయాలి


మాట్లాడుతున్న జిల్లా దళిత ఉద్యమ నేత అప్పారావు

లక్కవరపుకోట: ప్రభుత్వం ఏర్పడి సంవత్సరమైనా.. నేటికీ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయకపోవడం అన్యాయమని జిల్లా దళిత ఉద్యమ నేత గంటాన అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో గల గాంధీ విగ్రహం వద్ద స్థానిక విలేకరలతో మంగళవారం మాట్లాడారు. కూటమి నేతలు ఎన్నికల సమయంలో దళితుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను మోకాలడ్డుతున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా నేటికీ సంబంధిత నిధులు విడుదల చేయకపోవడం అన్యాయమన్నారు. నియోజకవర్గం కేంద్రాల్లో అంబేద్కర్ విజ్ఞాన భవనాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా వాగ్గేయకారుడు ఆతవ ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ దళితులకు సంబంధించి భూ సమస్యలు అధికంగా వున్నాయని రెవెన్యూ అధికారులు స్పందించి పరిష్కరించాలని కోరారు. దళిత బహుజన ఫ్రెంట్ జిల్లా అధ్యక్షుడు పేడ సూరిదేముడు, దళిత నాయకులు బోనెల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో బదిలీ

గుర్ల: ఎంపీడీవో కె.శేషుబాబు మంగళవారం బదిలీ అయ్యారు. గుర్ల నుంచి సామర్లకోట ఈటీసీకి జిల్లా పరిషత్ అధికారులు బదిలీ చేశారు. ఈయన స్థానంలో మండల ఏవోగా పని చేస్తున్న ఏటీ వరప్రసాద్‌ను ఇంచార్జ్ ఎంపీడీవోగా నియమించారు. బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో శేషుబాబుకు మండల పరిషత్ సిబ్బంది ఘనంగా సత్కరించారు.

నేడు మెగా జాబ్ మేళా

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గేటు సమీపంలో గల వాగ్దేవి కళాశాలలో బుధవారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు కళాశాల కరస్పాండెంట్ కె.మహేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెగా జాబ్ మేళాకు పలు బహుళార్థక కంపెనీలు వస్తున్నాయని పెద్ద ఎత్తున నిరుద్యోగ యువకులు పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

9న దేశవ్యాప్త సమ్మె


ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

దత్తిరాజేరు: దేశ వ్యాప్తంగా ఈ నెల 9న జరగనున్న సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి పిలుపునిచ్చారు. సమ్మెలో గ్రీన్ అంబాసిడర్లు, భోజన పథకం నిర్వాహకులు పాల్గొనేందుకు అవకాశం ఇవ్వాలని ఎంఈవో వెంకటరావు, మండల పరిషత్ పర్యవేక్షకుడు శివాజీకి మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. ప్రతి విద్యార్థికి రూ.20 చొప్పున మెనూ చార్జీలు చెల్లించాలని, నూతన విద్యా విధానం రద్దు చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు.

వైద్యులకు సత్కారం

గజపతినగరం రూరల్: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రానికి చెందిన స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు వైద్యులు అజయ్‌కుమార్, పడాల ప్రశాంత్‌లకు సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ వైద్యో నారాయణో హరి అని పెద్దలు చెప్పినట్టు వైద్యులు దేవుడితో సమానమన్నారు. వారు అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

తప్పిన పెను ముప్పు

దత్తిరాజేరు: మరడాం పాత రైలు హాల్ట్ వద్ద మంగళవారం రాత్రి పెను ముప్పు తప్పింది. రైలు పట్టాల పక్కన ఉన్న పొలాల్లో కాకర కాయలను బొలేరా వ్యాన్‌కు లోడ్‌చేసి తిప్పుతుండగా అదుపుతప్పి రైలు పట్టాలపైకి వెళ్లింది. అంతలోనే విజయనగరం నుంచి బొబ్బిలి గూడ్స్ రైలు రావడంతో గమనించిన డ్రైవర్ వ్యాన్ నుంచి దూకేశాడు. వ్యాన్ వెనుక భాగం నుజ్జునుజ్జయ్యింది.

విత్తనశుద్ధితో ప్రయోజనాలు


జామి: భీమసింగిలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీ


దత్తిరాజేరు : మరడాంలో రైతులకు వ్యవసాయ సూచనలు చేస్తున్న ఏడీఏ నిర్మలజ్యోతిభానులత


గజపతినగరం: ముచ్చర్లలో మాట్లాడుతున్న ఏవో కిరణ్‌కుమార్

జామి: విత్తనశుద్ధి వలన అధిక ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ సహాయ సంచాలకులు బి.భానులత అన్నారు. భీమసింగి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనశుద్ధి వలన తెగుళ్ల వ్యాప్తి నిర్మూలన చేయవచ్చని అన్నారు. రైతులకు వరిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. మొలక శాతం, కాలిబాటలు గురించి తెలియజేశారు. సాగు పద్ధతులు డ్రమ్‌సీడర్, సీడ్ డ్రిల్, మెషిన్‌ట్రాన్స్‌ప్లాంటేషన్ పద్ధతులు గురించి వివరించారు. ఎరువులు, పురుగు మందులు వినియోగం తగ్గించాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయంపై రైతులు మొగ్గు చూపాలన్నారు. కార్యక్రమంలో ఏవో ఎం.పూర్ణిమ, ఏఈవోలు అహ్మద్, భార్గవి, పలువురు రైతులు గ్రామపెద్దలు ధనియాల పైడిరాజు, జొన్నాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నీరు నిల్వ లేకుండా చూడాలి

దత్తిరాజేరు: అకాల వర్షాలు పడడంతో వరి నారుమడులు, పత్తి పంటలలో నీరు నిల్వ లేకుండా రైతు చూసుకోవాలని గజపతినగరం ఏడీఏ నిర్మలజ్యోతి అన్నారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మరడాం, తాడేందొర వలన గ్రామాలలో ఏవో అనురాధతో కలసి పత్తి, వరి నారుమడులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో రైతులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పత్తి పంటలకు ఎరువులు వేసేటప్పుడు వ్యవసాయ సిబ్బంది చెప్పిన మోతాదులో ఎరువులు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతు శిక్షణా కేంద్రం ఏవో గోవిందమ్మ, ఏఈవో లీలాకృష్ణ, వీపీఏ సంతోషి పాల్గొన్నారు.

గజపతినగరంలో..

గజపతినగరం: ఆధునిక పద్ధతుల్లో వరి సాగు చేసిన రైతులకు ఆశించే దిగుబడులు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఏవో పి.కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ముచ్చర్ల, జిన్నాం గ్రామాల్లో జరుగుతున్న పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. రైతులు సీడ్ డ్రిల్‌తో నేరుగా విత్తనం మరియు ఎరువులు కలిపి ఒకేసారి వేయటం వలన పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని చెప్పారు.

ఖాతాదారులకు బీమా తప్పనిసరి


ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న లీడ్ బ్యాంకు మేనేజర్ రమణమూర్తి

గుర్ల: బ్యాంకు ఖాతాదారులందరు బీమా తప్పనిసరిగా చేసుకోవాలని లీడ్ బ్యాంకు మేనేజర్ వి.వి. రమణమూర్తి సూచించారు. మండలంలోని ఆనందపురంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జన సురక్ష పథకంపై మంగళవారం అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకులు నుంచి ఓటీపీ, ఈకేవైసీ గురించి అవగాహన కల్పించారు. బ్యాంకు ఖాతాలపై అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి అడిగినా.. ఎటువంటి సమాచారం ఇవ్వకూడదని తెలియజేసారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా పథకంలో చేరడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో డీసీసీబీ జనరల్ మేనేజర్ కేవీవీ సత్యనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ ఎ.శ్రీనివాసరావు, గుర్ల డీసీసీబీ మేనేజర్ హరికేశవరావు, సర్పంచ్ మీసాల సత్యవతి పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు పండ్లు, పుస్తకాలు అందజేస్తున్నన్న ఎ.ఐ.ఐ.ఇ.ఏ సభ్యులు

శృంగవరపుకోట: ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు సంఘం వజ్రోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలో స్థానిక పుణ్యగిరిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పండ్లు, నోటు బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్.కోట శాఖ ప్రెసిడెంట్ టి.జగన్నాథం, కార్యదర్శి కె.శివప్రసాద్ మాట్లాడుతూ వజ్రోత్సవంలోకి అడుగిడుతున్న అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం(ఎ.ఐ.ఐ.ఇ.ఏ) నిరంతరంగా పాలసీదారులు, ఉద్యోగులు హక్కుల కోసం పోరాటాలు చేసి, ఎన్నో చారిత్రక విజయాలు సాధించిందన్నారు. జీవీసీ వంటి ప్రజారంగ సంస్థల పరిరక్షణకు కృషి చేసిందన్నారు. విశాఖ డివిజన్ ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, కామేశ్వరి మాట్లాడుతూ ఎఐఐఇఏలో సభ్యులుగా ఉండటం గర్వకారణం అన్నారు. అనంతరం స్థానిక ఎల్.ఐ.సి కార్యాలయం ఎదుట పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో బీమా ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు మంథా సుబ్బారావు, శివప్రసాద్, సుజాత, మాధురి, హారిక, జగన్నాధం తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు సహకరించాలి


రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఓటరు నమోదుపై వివరిస్తున్న తహసీల్దార్

వేపాడ: 2025 సమ్మర్ రివిజన్‌లో భాగంగా నిర్వహించే ఓటరు నమోదు కార్యక్రమంలో రాజకీయ పార్టీలు సహకరించాలని తహసీల్దార్ జె.రాములమ్మ కోరారు. తన కార్యాలయంలో సమ్మర్ రివిజన్ పై రాజకీయ పార్టీ నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ 1200 ఓటర్లు దాటిన పోలింగ్ బూత్‌లు పెంచాల్సి వుందని అయితే మండలంలో అటువంటివీ ఏమీ లేవన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ యువతీ యువకుడు ఓటరు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. డెత్‌ల తొలగింపులుంటే సహకరించాలన్నారు. పోలింగ్ బూత్‌ల్లో అన్ని సౌకర్యాలున్నాయని తెలిపారు. సమావేశంలో డీటీ రామకృష్ణ, ఎంపీపీ సత్యవంతుడు, కొట్యాడ రమణమూర్తి, రుద్ర వెంకటరావు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన పలువురు నేతలు


చీపురుపల్లి: మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసిన బెల్లాన వంశీకృష్ణ


గజపతినగరం రూరల్: జగనన్నను కలసిన కడుబొట్ల

చీపురుపల్లి: వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని పీఏసీ మెంబర్, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కుమారుడు, ఆ పార్టీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ కలిశారు. మంగళవారం తాడేపల్లిలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

జగన్మోహనరెడ్డిని కలసిన కడుబొట్ల

గజపతినగరం రూరల్: వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డిని మండలంలోని మధుపాడ గ్రామ సర్పంచ్ కడుబొట్ల పైడపునాయుడు విజయవాడలోని మంగళవారం కలిశారు. రాష్ట్రస్థాయి యూత్ వింగ్ సమావేశానికి గజపతినగరం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న పైడపునాయుడు సమావేశంలో పాల్గొని జగనన్న ఆశీస్సులను పొందామని తెలిపారు. జగనన్న ఆశీస్సులతో వైఎస్సార్‌సీపీ యువజన విభాగాన్ని మరింత బలోపేతం చేస్తానని తెలిపారు.

3న వైఎస్సార్‌సీపీ జిల్లా స్థాయి సమావేశానికి తరలిరండి

- 7న నియోజకవర్గ సమావేశం విజయవంతం చేయండి
- మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తదితరులు

గజపతినగరం రూరల్: బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ఈ నెల 3న గురువారం జిల్లా కేంద్రంలో జరగనున్న వైఎస్సార్‌సీపీ జిల్లా స్థాయి సమావేశానికి నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి భారీగా పార్టీ శ్రేణులు తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు హాజరవుతారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా.. ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు జగనన్న ఆదేశాల మేరకు ఈ నెల 4వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ పలు కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. పవన్ కల్యాణ్ చంద్రబాబుతో కలిసి ప్రజలకు ఎన్నికల సమయంలో లేనిపోని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ఒక్క హామీని అమలు చేయలేక ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ చేసిన వెన్నుపోటు కార్యక్రమం విజయవంతం కావడంతో చంద్రబాబు భయపడి తల్లికి వందనం పథకం అమలు చేశారన్నారు.

7న నియోజకవర్గ స్థాయి సమావేశం

ఈ నెల 7వ తేదీన గజపతినగరం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం మండల కేంద్రంలోని బెల్లాన కన్వెన్షన్ హాల్‌లో జరుగుతుందన్నారు. పార్టీ శ్రేణులు తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, మండల యువ నాయకులు మండల సురేష్, కర్రి రామునాయుడు, శీర రమణ, గేదెల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అడిగితేనే.. పౌష్టికాహారం

గుర్ల: మండలంలోని పున్నపురెడ్డిపేటలో బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారంలో భాగంగా అందించాల్సిన రేషన్‌ను అంగన్‌వాడీ కార్యకర్త సక్రమంగా ఇవ్వడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేషన్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించిన ఫలితం లేకుండా ఉందని, కొంతమంది లబ్ధిదారులకు మాత్రం ఇంటి వద్దకే రేషన్ పంపిస్తున్నారని బాలింతలు ఆరోపిస్తున్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శకుంతల వద్ద ప్రస్తావించగా లబ్ధిదారులందరికి సక్రమంగా రేషన్ అందిస్తున్నామని తెలిపారు.